క్లుప్తంగా

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలో 11కేవీ విద్యుత్ లైన్‌లకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగిస్తున్నందున మంగళవారం ఉదయం 7 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలచారి ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లగూడ, బస్టాండ్, పద్మావతి కాలనీ, ఆర్టీసీ కాలనీ, బీటీఎస్, మిర్యాలగూడ రోడ్డు, డాక్టర్స్ కాలనీ, ఓల్డ్ సిటీ, జామ మసీదు, హౌసింగ్ బోర్డు(మునుగోడు రోడ్), ఉస్మాన్‌పుర, హనుమాన్ నగర్, మాధవనగర్, స్టార్ ఫంక్షన్ హాల్, పోతుగడ్డ, గుండ్లపల్లి ఎక్స్ రోడ్డు, గోకుల్‌నగర్, అసద్ నగర్, క్లాక్ టవర్, శ్రీనగర్ కాలనీ, హౌసింగ్ బోర్డు(ఎన్‌జీ కాలేజీ), తులసి నగర్, జమ్మలగూడ, లైన్‌వాడ, ఖాజాబౌలి, శ్రీకృష్ణానగర్, డీవీకే రోడ్, చైతన్యపురి, గణేశ్‌నగర్, సాయి నగర్, అబ్బాసియా కాలనీ, నెల్లగిరి, ముత్యాలమ్మ కాలనీ, అబ్బాసియా కాలనీ-2, సిమెంట్ రోడ్, అక్కచెల్మ, రైతు బజార్, సిద్ధార్థ కాలనీ, శ్రీరామ్ నగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

నల్లగొండ టౌన్: పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో మలక్‌పేట యశోద హాస్పిటల్ వారు సోమవారం రిటైర్డ్ ఉద్యోగులకు డాక్టర్ భానుతేజారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీ టూడీ ఈకో పరీక్షలను ఉచితంగా నిర్వహించి వారికి అవసరమైన మందులు అందజేశారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకట్‌రెడ్డి, కార్యదర్శి జెల్లా శ్రీశైలం, మండల అధ్యక్షుడు గజవెల్లి సత్యం, యాద వాసుదేవ్, ఆంజనేయులు, శంకర్‌రెడ్డి, శేషారెడ్డి, ఆజం అలీ, మహబూబ్, భిక్షం మహేష్ పాల్గొన్నారు.

## మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం


రుద్రాభిషేకం చేస్తున్న అర్చకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలో గల శ్రీకృష్ణ ఆలయంలో కాశీ విశ్వేశ్వరస్వామి విగ్రహానికి సోమవారం మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి అభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ కేసాని వేణుగోపాల్‌రెడ్డి కవిత, కర్నే వరప్రసాద్, సిరిగిరి వెంకట్‌రెడ్డి, పరమేష్, రజిత, సువర్ణ, జయమ్మ, లక్ష్మి, రమణ, జ్యోతి, అలియమ్మ, రాణి, మహేశ్వరి, లలిత పాల్గొన్నారు.

## 23న మాలల ఆత్మీయ సభ

మర్రిగూడ : నల్లగొండలో ఈ నెల 23న నిర్వహించనున్న మాలల ఆత్మీయ సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నియోజకవర్గ కో కన్వీనర్ నాగిళ్ల మారయ్య కోరారు. సోమవారం మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి, తిరగండ్లపల్లి గ్రామాల్లో ఆత్మీయ సభ వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో చెల్లం బాలసుందర్‌రావు, యంజల శ్రీనివాస్, రమేష్, అనిల్, భానుచందర్, శివ, బాలకృష్ణ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వే పరిశీలన

తిప్పర్తి : ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుల గణన సర్వే సోమవారం తిప్పర్తి మండంలోని మర్రిగూడెం గ్రామంలో నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి నివాసంలో సర్వే నిర్వహించగా మండల ప్రత్యేక అధికారి, మార్కెటింగ్ ఏడీ ఛాయాదేవి సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిప్పర్తి మండలవ్యాప్తంగా ఇప్పటివరకు 85శాతం సర్వే పూర్తయిందని తెలిపారు. మిగిలిన సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సింహస్వామి, పుష్పలత పాల్గొన్నారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ


మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఈద భాస్కర్

నాంపల్లి : మండలంలోని మల్లపురాజుపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శామల నాగసేనారెడ్డి సహకారంతో త్రివేణి సంఘం ఆధ్వర్యంలో సోమవారం బాలల హక్కుల సంక్షేమ సమితి జిల్లా మెంబర్ ఈద భాస్కర్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈద భాస్కర్ మాట్లాడుతూ దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు జి.శ్రీనివాసులు, రవికుమార్, సీఆర్పీ సత్యవతి, విద్యార్థులు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ధాన్యం కొనుగోళ్లు

- ఇప్పటి వరకు 70,288 క్వింటాళ్ల ధాన్యం సేకరణ
- రైతుల ఖాతాల్లో రూ.7.07 కోట్లు జమ
- ఇంకా 15 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వ


శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ యార్డులో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

శాలిగౌరారం: మండలంలో వానాకాలం సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. శాలిగౌరారం మండలంలో 12 కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. అందులో ఐకేపీ ఆధ్వర్యంలో 6 కేంద్రాలు, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4, ఎఫ్‌పీఓ(రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య) ఆధ్వర్యంలో రెండు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

**1153 మంది రైతుల నుంచి..**

శాలిగౌరారం మండలంలోని 12 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటివరకు 1153 మంది రైతుల నుంచి 70288.40 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన ధాన్యం విలువ సుమారు రూ.16.31 కోట్లు. అందులో 593 మంది రైతులకు రూ.7.07 కోట్లు బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. అందులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 384 మంది రైతులకు రూ.4.22 కోట్లు, ఐకేపీ ఆధ్వర్యంలో 203 మంది రైతులకు రూ.2.78 కోట్లు, ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఆరుగురు రైతులకు రూ. 6.96 లక్షలు జమచేసినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.

**19వేల ఎకరాల్లో వరి సాగు**

వ్యవసాయ శాఖ నివేదిక ప్రకారం శాలిగౌరారం మండలంలో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో మొత్తం 19వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగుచేశారు. 4.50 లక్షల క్వింటాళ్లకు పైగా ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారుల అంచనా వేశారు. ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 70288.40 క్వింటాళ్ల ధాన్యం సేకరించారు. మరో 15 వేల క్వింటాళ్ల ధాన్యం నిల్వలు కొనుగోలు కేంద్రాల్లో ఉన్నాయి. ఇదిలా ఉండగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొంత ఆలస్యంగా ప్రారంభం కావడంతో అనేకమంది రైతులు తక్కువ ధరకు వేల క్వింటాళ్ల ధాన్యం పారాబాయిల్డ్ రైస్‌మిల్లులకు అమ్ముకున్నారు.

**రైతులకు మేలు జరిగింది**



ధాన్యం డబ్బులు తొందరగానే బ్యాంక్ ఖాతాల్లో జమకావడంతో కుటుంబ అవసరాలు, యాసంగి పంట పెట్టుబడులకు ఇబ్బందులు లేకుండా పోయింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు జరిగింది

-చింత ధనుంజయ్య, రైతు, శాలిగౌరారం

**కొనుగోళ్లు వేగవంతంగా చేస్తున్నాం**



ధాన్యం కొనుగోళ్లను వేగంగా నిర్వహిస్తున్నాం. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో చిన్నచిన్న సమస్యలు ఏర్పడుతున్నా వాటిని వెంటనే పరిష్కరిస్తున్నాం. కొనుగోలు చేసిన ధాన్యానికి వెంటనే బిల్లులు చేసి రైతుల ఖాతాలో జమ చేస్తున్నాం.

-నిమ్మల ఆంజనేయులు, సీఈఓ, పీఏసీఎస్ శాలిగౌరారం

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నార్కట్‌పల్లి : నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో విడతలవారీగా మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నార్కట్‌పల్లి మండల కేంద్రంలో లక్ష్మీనగర్‌లోని రాశి ఫ్యాక్టరీ సమీపాన ప్రాథమిక పాఠశాలకు రూ.17 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మాణం, కబరస్తాన్ వద్ద రూ.5 లక్షలతో కాంపౌండ్ వాల్ నిర్మాణం, మసీదు వద్ద రూ.4లక్షలతో డ్రెయినేజీ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి వేగవంతంగా జరుగుతోందని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, సట్టు సత్తయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, ఐతరాజు యాదయ్య, జేరిపోతుల భారత్, స్రవంతి, అచ్చాలు, సిద్దగోని స్వామి, భిక్షం, సత్తి, అజాజ్, సమద్ తదితరులు పాల్గొన్నారు.


పాఠశాల ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

# సమస్యలు పరిష్కరించాలని వినతులు


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : జిల్లాలో పెండింగ్‌లో ఉన్న బెస్ట్ అవైలబుల్ స్కీం నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నిధులు విడుదల చేయని కారణంగా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కంభంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు ఆకునూరి నరేష్ పాల్గొన్నారు.

**భూమిని ఆక్రమించుకుంటున్నారని..**

నల్లగొండ టౌన్ : చర్లపల్లి గ్రామంలోని తమ పట్టాభూమి 3 ఎకరాలను కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ భూమిని రక్షించాలని కోరుతూ సోమవారం చర్లపల్లికి చెందిన ఎలిజాల సోమయ్య-అంజమ్మ దంపతులు కలెక్టర్, ఎస్పీలకు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం జెడ్పీ గెస్ట్ హౌజ్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. 30 సంవత్సరాల క్రితం కొనుగోలు చేసి సేద్యం చేసుకుంటున్న భూమిని చర్లపల్లి గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి అనే వ్యక్తులు ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, అడ్డుకున్న తమపై దౌర్జన్యం చేశారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**అక్రమ పట్టా రద్దు చేయాలని..**

రామగిరి(నల్లగొండ): అక్రమ పట్టాను రద్దు చేయాలని తిప్పర్తి మండలం కంకణాలపల్లికి చెందిన కోన జానయ్య సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులతో విచారణ చేయించి తనకు తగిన న్యాయం చేయాలని కోరారు.

**ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని..**

చిట్యాల: జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగినప్పుడు వెంటనే వైద్య చికిత్స అందించేందుకు ట్రామాకేర్ సెంటర్‌ను చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో ఏర్పాటు చేయాలని ఆ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు దేశబోయిన నర్సింహ సోమవారం నల్లగొండ కలెక్టరేట్‌లో అధికారులకు వినతి పత్రం అందజేశారు. వెలిమినేడు గ్రామంలో జాతీయ రహదారిపైనే ప్రభుత్వ ఆస్పత్రి కోసం కేటాయించిన స్థలంలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రమాద బాధితులతో పాటు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.

# తెలంగాణ సంబరాలు ఘనంగా నిర్వహించాలి


నల్లగొండ రూరల్ : మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి


తిప్పర్తి : మాట్లాడుతున్న ఏపీఎం శ్రీదేవి

నల్లగొండ రూరల్ : తెలంగాణ సంబరాలు ఘనంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డి అన్నారు. సంబరాల నిర్వహణపై సోమవారం నల్లగొండలోని మండల సమాఖ్య కార్యాలయంలో సీసీలు, వీవోఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక స్వావలంబనకు చేపడుతున్న కార్యక్రమాలను తెలియజేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల్లో లేని మహిళలను సంఘాల్లో చేర్పించాలన్నారు. జిల్లా సమాఖ్య భవనాలు నిర్మిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఏపీఎం వినోద, ఏపీఓ స్ఫూర్తిరెడ్డి, గీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఇందిరా శక్తి కార్యక్రమంపై అవగాహన**

తిప్పర్తి : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం చేపడుతోందని ఏపీఎం శ్రీదేవి అన్నారు. ఇందిరా మహిళా శక్తి సంబరాలపై సోమవారం తిప్పర్తి మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం శ్రీదేవి మాట్లాడుతూ సమభావన సంఘంలో లేని మహిళలను సంఘంలో చేర్పించడం, రుణ బీమా, ప్రమాద బీమా పథకం, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, యూనిఫాంల తయారీ, బ్యాంక్ లింకేజీ, వడ్డీలేని రుణాలు, దుకాణాల ఏర్పాటు, డ్వాక్రా బజార్ ఏర్పాటు అంశాలపై డిసెంబర్ 9వ తేదీ వరకు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సునిత, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**మహిళా శక్తి సంబరాలను జయప్రదం చేయాలి**

నకిరేకల్ : వరంగల్‌లో మంగళవారం జరగబోయే ఇందిరా మహిళా శక్తి సంబరాలను విజయవంతం చేయాలని ఐకేపీ ఏపీఎం నరహరి కోరారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో సోమవారం జరిగిన మండల సమాఖ్య ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సిబ్బంది నర్సయ్య, మట్టయ్య, స్వరూప పాల్గొన్నారు.

**డిసెంబర్ 9 వరకు సంబరాలు..**

కట్టంగూర్ : తెలంగాణ సంబరాల్లో భాగంగా డిసెంబర్ 9వ తేదీ వరకు నిర్వహించే ఇందిరా మహిళా శక్తి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏపీఎం కస్పరాజు సైదులు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో జరిగిన మండల మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏపీఓ రాంమోహన్, సీసీలు కారింగు శంకర్, వెంకన్న, మండల సమాఖ్య అధ్యక్షురాలు తాటిపాముల చైతన్య, మల్లీశ్వరి, ఇందిర, శాంతి పాల్గొన్నారు.

## నేడు రైతులకు అవగాహన

మర్రిగూడ : వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే నష్టాల గురించి వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలతో మర్రిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు అవగాహన కల్పించనున్నట్లు ఏఓ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటలకు నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇంటింటా సీపీఎం ప్రచారం


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : పట్టణంలోని పెద్దబండలో నాలుగో తరగతి ఉద్యోగుల కాలనీలో కంపచెట్లను తొలగించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, నల్లగొండ పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. మిర్యాలగూడలో జరుగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం వారు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. అదేవిధంగా మహాసభల కోసం పెద్దబండలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలో రోడ్డు గుంతలమయంగా మారి ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గాదె నర్సింహ, పాక లింగయ్య, కొత్త అశోక్, నోముల యాదయ్య, మెడిశెట్టి లింగమ్మ, చంద్రమ్మ, శంకర్, రాధాకృష్ణ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థినుల ప్రతిభ

నకిరేకల్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలో సాధ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని ఆ పాఠశాల హెచ్‌ఎం కోదాటి రాములు సోమవారం తెలిపారు. పదో తరగతి చదువుతున్న రాపోలు శృతి, ఆకావరపు నందిని టాలెంట్ టెస్టులో ఎంపికయ్యారని పేర్కొన్నారు. విద్యార్థినులకు ప్రముఖ ప్రైవేటు కళాశాలల్లో ఉచితంగా రెండేళ్ల ఇంటర్ విద్యతోపాటు హాస్టల్ వసతికి అయ్యే ఖర్చును ఫౌండేషన్ భరిస్తుందన్నారు. ఎంపికైన విద్యార్థినులను ఎంఈఓ నాగయ్య అభినందించారు.


విద్యార్థినులను అభినందిస్తున్న ఎంఈఓ నాగయ్య, హెచ్‌ఎం రాములు

## డిసెంబర్ 30న బహిరంగ సభ

కనగల్: సీపీఐ స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి కోరారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 30న నల్లగొండలో సీపీఐ ఆధ్వర్యంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల కార్యదర్శి గంటా సత్యనారాయణ, దోటి పాండరి, తొరకొప్పుల నాగ య్య, బోగారి రామకోటి, తలారి లచ్చయ్య, జాన య్య, బైరగోని వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ధర్మసమాజ్ పార్టీ నాయకులు

నల్లగొండ టౌన్ : ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు వంటి సమస్యలను పరిష్కరించాలని ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తలారి రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక సదుపాయాలు పెంచి మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. అర్హులైన వారికి 200 గజాల స్థలం ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, కోకన్వీనర్లు కృష్ణయాదవ్, శంకర్, గిరి, జగన్, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు చేసిన ధాన్యాన్ని తరలించండి


ధాన్యం లోడింగ్ పనులను పరిశీలిస్తున్న డీఎస్ఓ వెంకటేశ్వర్లు

మర్రిగూడ : మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్ఓ వి.వెంకటేశ్వర్లు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే లారీల ద్వారా మిల్లులకు తరలించాలని సూచించారు. గోనె సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. ఇప్పటివరకు 10 లారీల ధాన్యం లోడ్‌లను తరలించినట్లు సిబ్బంది ఆయనకు వివరించారు. ఆయన వెంట సీసీ శ్రీశైలం, శంకర్ ఉన్నారు.

## గ్రంథాలయ మాజీ ఉద్యోగులకు సన్మానం


మాజీ ఉద్యోగులను సన్మానిస్తున్న సిబ్బంది

రామగిరి(నల్లగొండ): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నల్లగొండ కేంద్ర గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గ్రంథాలయ సంస్థలో పనిచేసి పదవీ విరమణ పొందిన వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంస్థ మాజీ చైర్మన్ గాదె వినోద్‌రెడ్డి, వయోజన విద్య అధికారి నర్సింహారెడ్డి, సంస్థ కార్యదర్శి బి.బాలమ్మ, రిటైర్డు ఉద్యోగులు నాగేశ్వరరావు, వేణుగోపాలచార్యులు, సిబ్బంది ఎమ్.నిర్మలాదేవి, కట్ట నాగయ్య, ఎమ్.రాజేష్, బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

# షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి


ధాన్యం రాశిని పరిశీలిస్తున్న నాయకులు

చండూరు : రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం చండూరు మున్సిపాలిటీ పరిధిలోని అంగడిపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సీపీఎం మండల కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తేమ శాతం పేరుతో రోజుల తరబడి ధాన్యం కొనుగోలు చేయకుండా రైతులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యుడు చిట్టిమల్ల లింగయ్య, రైతులు బి.నరసింహ, కె.రామలింగం, గంట గణపతి, బోయపల్లి శివలింగం పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో జలాధివాస పూజలు


అమ్మవారి రథ సేవలో కోలాట ప్రదర్శన చేస్తున్న మహిళలు

నకిరేకల్ : పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం, దేవత విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో భాగంగా సోమవారం జలాధివాసం, హోమం, శాంతి పూజలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి రథ సేవను పట్టణ వీధుల గుండా మహిళల కోలాటాల మధ్య ఊరేగించారు. వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, ఆర్యవైశ్య సంఘం మండల, పట్టణ అధ్యక్షులు బ్రహ్మదేవర రాంమోహన్ రావు, వీర్లపాటి నర్సింహారావు, ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.


అమ్మవారి రథ సేవ ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే వేముల వీరేశం

## స్నేహితుడి కుటుంబానికి చేయూత

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామానికి చెందిన తెల్సూరి శ్రీను ఇటీవల మృతి చెందాడు. శ్రీను కుటుంబాన్ని ఆదుకునేందుకు అతడితో కలిసి ఆ గ్రామంలో చదువుకున్న జెడ్పీహెచ్ఎస్ 2003-04 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ముందుకు వచ్చారు. వారంతా కలిసి సేకరించిన లక్షా పదమూడు వేల రూపాయలను బ్యాంకులో ఫిక్స్ డిపాజిట్ చేసిన పత్రాలను సోమవారం శ్రీను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీను కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.


ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలను అందజేస్తున్న స్నేహితులు

# టీఎస్ యూటీఎఫ్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

చిట్యాల: నార్కట్‌పల్లిలో ఈ నెల 24వ తేదీన జరగనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా ఆరో మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు బడుగు అరుణ కోరారు. జిల్లా మహాసభల ప్రచార పోస్టర్‌ను యూనియన్ నాయకులతో కలిసి సోమవారం చిట్యాలలో ఆమె విడుదల చేసి మాట్లాడారు. అనంతరం మహాసభల ఆహ్వాన పత్రాలను ఎంఈఓ సైదానాయక్, జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎం గోగికార్ మాధవి, కుకుడాల గోవర్ధన్‌కు అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు బొప్పని యాదయ్య, ప్రధాన కార్యదర్శి ఏషమల్ల నాగయ్య, దాసరి శ్రీరాములు, రంగా రామలింగయ్య, సత్యపాల్, సతీష్, చంద్రశేఖర్, జానకి, సాధిక్ పాల్గొన్నారు.

నాంపల్లి : టీఎస్ యూటీఎఫ్ మహాసభల పోస్టర్‌ను సోమవారం నాంపల్లిలోని ఎంఆర్సీ భవనం ఆవరణలో ఇన్‌చార్జ్ ఎంఈఓ మల్లికార్జున రావు ఆవిష్కరించారు. సంఘం మండల అధ్యక్షుడు జింకల సత్యనారాయణ, అజయ్‌కుమార్, కస్పరాజు వెంకన్న, పల్లేటి వెంకటయ్య, కృష్ణవేణి, శ్రవణ్‌కుమార్, లక్ష్మణ్, దీవంత, సంపత్ ఉన్నారు.


చిట్యాల : పోస్టర్ విడుదల చేస్తున్న యూనియన్ నాయకులు

## రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తు గడువు పెంపు

మిర్యాలగూడ : మిర్యాలగూడ డివిజన్‌లో ఖాళీగా ఉన్న 30 ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో రేషన్ డీలర్ల నియామకానికి దరఖాస్తు స్వీకరణ గడువును ఈ నెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే, వరి కోతల కారణంగా దరఖాస్తు చేసుకునే గడువు తేదీని ఈనెల 25 సాయంత్రం 5గంటల వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఇదే చివరి అవకాశమని ఇకముందు ఎలాంటి గడువు పొడిగింపు ఉండదని ఆయన పేర్కొన్నారు.